సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం | 8 | మార్చి | 2024



ప్రసాద్ నిర్మాణాలకు శ్రీకారం

శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో మరో కీలక అంకానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం శ్రీకారం చుట్టారు.


8లో



ఉత్తరకంచి బ్యాంక్ దొంగల పట్టివేత

ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి స్టేట్‌బ్యాంక్‌లో ఫిబ్రవరి 7న జరిగిన చోరీకి సంబంధించి నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు కాకినాడ ఎస్పీ గురువారం తెలిపారు.

8,970 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల నీరు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.40 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

పేదల సొంతింటి కల సాకారం



మహిళకు ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: పేదల సొంతింటి కల జగనన్న ప్రభుత్వంలో సాకారం అయ్యిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం మున్సిపాలిటీకి సంబంధించి పేదలందరికీ ఇళ్లు పథకంలో 2,459 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా, రిజిస్ట్రేషన్ ప్రతాలను స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల పేరున ప్రభుత్వం అందించిన ఇంటి పట్టాను రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వడంతో సర్వ హక్కులూ పొందవచ్చన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇళ్ల పట్టాల లబ్ధిదారులైన మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. మరో అతిథి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ పట్టణంలో పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారమవుతున్నందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి దేవరపల్లి గీత, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, జెడ్పీటీసీ సభ్యుడు పి.శ్రీహరి రామగోపాల్ పాల్గొన్నారు.

మహిళలు స్వావలంబన సాధించాలి



జడ్జి నరేష్‌ను సత్కరిస్తున్న, డీఆర్వో వెంకటేశ్వర్లు, డీపీవో, సీడీపీలు

అమలాపురం రూరల్: మానవ జాతి మనుగడకు ప్రాణం పోస్తున్న స్త్రీలు సామాజిక, ఆర్థిక రంగాలలో స్వావలంబనను సాధించాలని సెకండ్ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి వి.నరేష్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు స్వతంత్రంగా ఆర్థిక పరిపుష్టి సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కుటుంబ వ్యవస్థ నుంచే మహిళల హక్కుల పట్ల అవగాహన పెరగాలని, భ్రూణ హత్యలు నిర్మూలించాలని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఆత్మ గౌరవంతో, స్వశక్తితో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అదనపు జిల్లా ఆరోగ్యశాఖ అధికారి భరత్‌లక్ష్మి మాట్లాడుతూ మహిళలకు సాధికారత కల్పించడంలో విద్య ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. విశిష్ట సేవలు అందించిన మహిళా అధికారులను సత్కరించారు. మెప్మా పీడీ ప్రియంవద, డీపీవో రాంబాబు పాల్గొన్నారు.

ఇదేమి సెలెక్షన్ 'బాబూ'



సుభాష్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ రామచంద్రపురంలో ఆదివారం ప్లకార్డులతో ప్రదర్శన



పవన్ కల్యాణ్‌తో హరీష్, సుభాష్, పల్లంరాజు (ఫైల్)

- టీడీపీ అభ్యర్థుల ఎంపికపై టీకేడర్ ఆగ్రహం
- పి.గన్నవరం స్థానికులకు ఇవ్వాలని డిమాండ్
- రామచంద్రపురం సుభాష్‌కు వద్దని పట్టు

సాక్షి, అమలాపురం: అభ్యర్థుల ఎంపికలో టీడీపీ నిర్ణయాలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పార్టీకి ఉన్న కాస్తంత పరపతి కూడా పోయేలా చేస్తున్నాయి. ఇందుకు పి.గన్నవరం, రామచంద్రపురం నియోజకవర్గాలే ఉదాహరణ. ఇక్కడ సర్వే పేరుతో రోజుకో కొత్త అభ్యర్థిని తెరపైకి తెస్తుండటంతో ఉన్న కొద్దిమంది కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారు. ఏళ్ల తరబడి జెండా మోస్తున్న స్థానికులను కాదని ఎక్కడెక్కడి నుంచో దిగుమతి చేయడంపై కేడర్ ఆగ్రహంతో ఉంది. పి.గన్నవరం అభ్యర్థిగా సరిపెళ్ల రాజేష్ కుమార్ (మహాసేన రాజేష్)ను ఎంపిక చేయడాన్ని టీడీపీ, జనసేన కేడర్‌తో పాటు వివిధ వర్గాల ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో పోటీ నుంచి తప్పుకుంటానని రాజేష్ ప్రకటించారు. ఇంతలోనే రామచంద్రపురం టీడీపీ టికెట్ వాసంశెట్టి సుభాష్‌కు కేటాయించారనే ప్రచారంతో అక్కడ నిరసన జ్వాలలు రేగాయి. ఈ నిర్ణయాన్ని స్థానిక పార్టీ కేడర్ వ్యతిరేకించడంతో పాటు ఆదివారం రామచంద్రపురంలో జరిగిన సమావేశంలో ఫర్నీచర్‌ను తగులబెట్టారు. ఒక కార్యకర్త ఒంటిపై కిరోసిన్‌పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

పి.గన్నవరంలో స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలని టీడీపీ మండల స్థాయి నాయకత్వం తీర్మానాలు చేస్తోంది. ఈ టికెట్ కోసం అమలాపురం మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ సీనియర్ నాయకుడు పరమట శ్యామ్, ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన మోకా బాల గణపతి వంటి వారు పైరవీలు చేస్తుండటాన్ని స్థానిక నాయకులు, కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు. వీరిలో ఎవరికి టిక్కెట్ ఇచ్చినా మహాసేన రాజేష్ తరహాలోనే సాగనంపుతామని వారు స్పష్టం చేస్తున్నారు. ఇలా ఒకదాని తరువాత మరొక వివాదం రేగడానికి టీడీపీ అధిష్టానమే కారణమనే విమర్శలు వస్తున్నాయి. రాజేష్, సుభాష్ ఇటీవలే టీడీపీలో చేరారు. ఇద్దరూ స్థానికేతరులు. అత్యంత వివాదాస్పదమైన వ్యక్తులుగా ముద్ర ఉంది. సోషల్ మీడియా వేదికగా రాజేష్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు జనసేనతో పాటు హిందూ సంస్థల ఆగ్రహానికి కారణమయ్యాయి. జనసేన పార్టీని ఆయన బూతులు తిట్టారు. ఇక సుభాష్‌పై గతంలో రౌడీషీట్ ఉంది. కోనసీమ జిల్లాకు అంబేడ్కర్ పేరు పెట్టిన సమయంలో జరిగిన అల్లర్లలో నిందితుడిగా ఉన్నాడు. 'ఇవన్నీ మా పార్టీ అధిష్టానానికి తెలుసు. ట్రిపుల్ ఆర్ (రఘురామ కృష్ణంరాజు) చెప్పారని రాజేష్‌కు, ఆర్థికంగా బలవంతుడని సుభాష్‌కు టిక్కెట్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇన్నాళ్లూ పార్టీ జెండా మోసిన వారిని పక్కన పెట్టారు' అని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం తాను తప్పుకుంటానని రాజేష్ ప్రకటించినా సరైన నాయకులు లేకపోవడంతో ఇప్పటికీ వలస నాయకులనే ప్రోత్సహించాల్సిన దుస్థితిలో ఆ పార్టీ కూరుకుపోయింది.

శెట్టిబలిజ నాయకుల డిమాండ్

అసెంబ్లీ టికెట్ల కేటాయింపులో శెట్టిబలిజలకు సముచిత స్థానం కల్పించాలని గురువారం కొత్తపేటలో జరిగిన జిల్లా టీడీపీ శెట్టిబలిజ నాయకుల సమావేశం అధిష్టాన వర్గాన్ని డిమాండ్ చేసింది. తూర్పుగోదావరి జిల్లాలో కనీసం రెండు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం కేటాయించాలని కోరారు.

పవన్ వ్యాఖ్యలతో సుభాష్‌పై వ్యతిరేకత

రామచంద్రపురంలో సుభాష్‌పై ఇంత వ్యతిరేకత రావడానికి జనసేన అధినేత పవన్ వ్యాఖ్యలే కారణం. ఇటీవల రాజమహేంద్రవరం వచ్చిన పవన్‌ను టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, గంధం పల్లంరాజు, సుభాష్ కలిశారు. కోనసీమ జిల్లాలో జనసేన పార్టీ నాయకులు ప్రతి నియోజకవర్గంలో రెండు వర్గాలుగా చీలిపోయి కొట్టుకుంటున్నా వారితో మాట్లాడని పవన్ టీడీపీ నాయకులను పిలిపించుకుని మాట్లాడడం చూసి సొంత పార్టీ కేడర్ విస్మయానికి గురవుతోంది. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. సుభాష్ అనే శెట్టిబలిజ నాయకుడు, గంధం పల్లంరాజు అనే కాపు కులానికి చెందిన వారు, బాలయోగి అబ్బాయి హరీష్ అనే దళిత వర్గానికి చెందినవారు ఏకమై తాను చెప్పిన దానిని తు.చ. తప్పకుండా పాటించారని, తాను కోరుకున్న కులాల ఏకీకరణ.. ఐక్యతకు ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఆ కులాల సంఘాలతోపాటు దళిత వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పల్లంరాజు, సుభాష్‌ను వారి కులాల ప్రతినిధులుగా పవన్ పోల్చడాన్ని ఆ కులాల సంఘాలు తప్పుపడుతున్నాయి. బీసీ రిజర్వేషన్ల కోసం కాపులు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం శెట్టిబలిజలు చేసిన పోరాటాల్లో పల్లంరాజు, సుభాష్ పాత్ర శూన్యం. పైగా, జిల్లాకు అంబేడ్కర్ పేరు పెట్టిన సమయంలో అమలాపురంలో చెలరేగిన అల్లర్లలో సుభాష్, పల్లంరాజు నిందితులు. ఆ అల్లర్ల తర్వాత స్నేహితులుగా మారారు. వీరిద్దరూ రాజకీయ అవసరాల కోసం చేసుకుంటున్న ప్రయత్నాలను కాపులు, శెట్టి బలిజల ఐక్యతగా చూపడాన్ని ఆ కుల సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మరీ ముఖ్యంగా దళితులు మండిపడుతున్నారు. మరోవైపు సుభాష్‌ను రామచంద్రపురం టీడీపీ కేడర్ వ్యతిరేకిస్తున్నా తనదే టిక్కెట్ అంటూ చాపకింద నీరులా ప్రచారం చేసుకుంటున్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ శుక్లా

సాక్షి, అమలాపురం: సార్వత్రిక ఎన్నికలలో పాల్గొనే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు నామినేషన్ దాఖలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి తదితర అంశాలలో సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పార్లమెంట్, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలలో అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచి రిటర్నింగ్ అధికారి ఫారం- 1 నోటీసు ప్రచురిస్తారన్నారు. తరువాత నిర్దేశించిన సమయంలో అభ్యర్థుల నామినేషన్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ నిబంధనలను ఆయన వెల్లడించారు. ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథ్ శర్మ, వివిధ పార్టీలకు చెందిన సంసాని నాని, దూరి రాజేష్, మల్లేశ్వరరావు, కుడిపూడి శ్రీనివాస్, కాశీ లక్ష్మీ భవానీ పాల్గొన్నారు.

ఆధార్ నమోదులో తప్పులు రాకూడదు

ఆధార్ నమోదులో తప్పులు నమోదు కాకుండా చూసుకోవాలని గ్రామ,వార్డు సచివాలయ నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం డిజిటల్ అసిస్టెంట్లకు ఆధార్ వర్క్ షాప్ నిర్వహించారు. ఆధార్ నమోదు బయోమెట్రిక్ స్వీకరణ, ఆధార్ గ్రీవెన్స్ నిర్వహణ, సర్వీసులు, విశ్లేషణ, తిరస్కరించిన కేసులపై తీసుకోవాల్సిన చర్యలు, కొత్తవారి నమోదు, ఆధార్ వెరిఫికేషన్, రాష్ట్ర పోర్టల్ స్టేటస్ అంశాలపై క్షుణ్ణంగా అవగాహన పెంపొందించుకోవాలని ఆధార్ ప్రోగ్రాం మేనేజర్ గిరిధర్ అన్నారు. స్టేట్ కోఆర్డినేటర్ వీఎస్ఎస్ సుందరం, జిల్లా కోఆర్డినేటర్ విజయ్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 300 కుటుంబాల చేరిక



మూలస్థానం అగ్రహారంలో కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని సంధిపూడి, మూలస్థానం అగ్రహారం గ్రామాల్లో బుధవారం రాత్రి యాదవ, రజక, కాపు వర్గాలకు చెందిన సుమారు 300 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. సంధిపూడిలో పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకటేశ్వర్లు, పార్టీ నేత తోరాటి గోవిందు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పోలాభత్తుల చిన్న ఆధ్వర్యంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన దాదాపు 50 కుటుంబాలు చేరాయి. మూలస్థానం అగ్రహారంలో వైఎస్సార్ సీపీ నేతలు కోనాల పేరిరెడ్డి ఆధ్వర్యంలో 50 రజక, 200 కాపు సామాజిక వర్గానికి చెందిన 500 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఐదేళ్లలో అన్ని వర్గాలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కృషి చేసిన సీఎం జగన్ మళ్లీ రాబోయే కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తారని బీసీలు నమ్మి పార్టీలో చేరడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పేర్కొన్నారు.

సీఎం జగన్ పేదల పక్షపాతి

అణగారిన పేద, మధ్య తరగతి వర్గాలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని పార్టీలో చేరిన కార్యకర్తలు వ్యాఖ్యానించారు. గతంలో ఇచ్చిన హామీలను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చకపోయినా బీసీ డిక్లరేషన్ పేరిట మరోసారి వెనుకబడిన వర్గాలను మోసగించేందుకు రావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, కడలి రమణ, శిద్ధిరెడ్డి శివ, తోట కొండయ్య, ఉండమట్ల భీమ శంకర్, తోట సతీష్ పాల్గొన్నారు.

మహిళల ప్రగతికి చేయూత

కలెక్టర్ శుక్లా



వైఎస్సార్ చేయూత చెక్ అందజేస్తున్న కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎమ్మెల్యే చిట్టిబాబు తదితరులు

సాక్షి, అమలాపురం: మహిళలు సమగ్ర ప్రగతి సాధించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వైయస్సార్ చేయూత పథకాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత, కుటుంబ స్థాయిలో మెరుగైన జీవనోపాధులను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందని అన్నారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత ఆర్థిక సాయాన్ని అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడ బహిరంగ సభలో బటన్ నొక్కి నేరుగా అకౌంట్లలో సీఎం జగన్ వైఎస్సార్ చేయూత సాయాన్ని జమచేశారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలో చేయూతను కలెక్టర్ శుక్లా చెక్ అందజేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో మొత్తం రూ.75 వేలు ఆర్థిక సహాయాన్ని వైఎస్సార్ చేయూత పథకం ద్వారా అందించామన్నారు. ఈ నిధులతో మహిళలు సుస్థిర జీవనోపాధులు పొందాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మహిళలు చిన్న వ్యాపారాలు, ఇతర అవసరాలకు, ఉపాధి కార్యక్రమాలకు వినియోగించుకుంటూ తమ కాళ్లపై తాము నిలబడి కుటుంబ స్థాయిలో ఆర్థిక ఆసరాగా నిలుస్తున్నారన్నారు. ప్రతి మండలానికి ఒక వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు అందిస్తున్నారన్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా నాలుగో విడతలో 89,619 మంది మహిళలకు రూ.168.03 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్, హితకారిణి సమాజం చైరపర్సన్ కాశీ బాలముని కుమారి, ఎల్‌ఎండీ కె.శ్యామ్‌బాబు, ఏపీడీ ఎం.జిలానీ, వక్ఫ్‌బోర్డ్ జిల్లా చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

జిల్లాలో నాలుగు విడతలుగా పంపిణీ ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	నగదు (రూ.కోట్లలో)
12.08.2020	80,347	150.65
22.06.2021	87,008	163.14
22.09.2022	89,174	167.20
07.03.2024	89,619	168.03
మొత్తం		694.02



ఆమెకు అగ్రాసనం

- మహిళా సాధికారతకే అగ్రతాంబూలం
- సర్పంచ్ నుంచి మంత్రి పదవి వరకూ ప్రాతినిధ్యం
- సంక్షేమ పథకాల అమలులోనూ వారికే ప్రాధాన్యం



మానవాళిలో సగం మాత్రమే కాదు.. అభివృద్ధిలోనూ అంతకు మించిన పాత్రను మహిళలు పోషిస్తున్నారు. మహిళల అభ్యున్నతే ఏ సమాజం ప్రగతికైనా కీలకమైన కొలమానం. దీనిని దృష్టిలో ఉంచుకునే 2019లో అధికారం చేపట్టిన నాటి నుంచీ మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ సాధికారతలపై దేశంలోని మరే ప్రభుత్వమూ పెట్టనంతగా మన ప్రభుత్వం దృష్టి పెట్టింది. జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ సంపూర్ణ పోషణ వంటి పథకాలతో గర్భస్థ శిశువు నుంచి పండు ముదుసలి వరకూ ప్రతి మహిళపై అభిమానం చూపిస్తున్న ఏకైక ప్రభుత్వం మాదే. దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లతో ఆడబిడ్డల రక్షణలో అందరి కంటే మిన్నగా అడుగులు ముందుకేశాం. 21వ శతాబ్దపు ఆధునిక భారతీయ మహిళ ఆంధ్రప్రదేశ్‌లోనే అవతరించేలా నిర్ణయాలు తీసుకున్నాం.

– సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గడచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ సుపరిపాలన మహిళా సాధికారితకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. రాజకీయ, ఆర్థిక, సామాజిక తదితర రంగాల్లో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించి, వారు స్వావలంబన సాధించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసి, విభిన్న, వినూత్న పథకాలతో వారి ఆర్థిక ఉన్నతికి తోడుగా నిలిచారు. వంటింటికే పరిమితమైన మహిళలకు గ్రామ సర్పంచ్ నుంచి అత్యంత కీలకమైన హోం మంత్రి వరకూ ఉన్నత పదవులతో తగిన గుర్తింపునిచ్చారు. ప్రధానంగా తమ కాళ్లపై తాము నిలబడేలా ఆర్థిక స్వావలంబన సాధించేలా తోడ్పాటునందించారు. గత పాలకులకు భిన్నంగా సంక్షేమ పథకాల్లో అత్యధికం మహిళల పేరిటే అమలు చేశారు.

రాజకీయంగా..

ఆర్థికంగా స్వావలంబనకు తోడ్పాటునివ్వడంతో పాటు రాజకీయంగా కూడా మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రాసనం వేశారు. నామినేటెడ్ సహా అన్ని పదవుల్లోనూ మహిళలను 50 శాతం రిజర్వేషన్లు కల్పించారు.

- కాకినాడ, అమలాపురం ఎంపీలుగా వంగా గీత, చింతా అనురాధ, రాష్ట్ర హోం మంత్రిగా తానేటి వనితకు అవకాశం కల్పించారు.
- కాకినాడ నగరంలోని మత్స్యకారుల్లో వాడబలిజ సామాజికవర్గం నుంచి తొలిసారిగా కర్రి పద్మశ్రీని శాసన మండలికి పంపించారు.
- కాకినాడ, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థల చైర్‌పర్సన్లుగా రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మేడపాటి షర్మిలారెడ్డిని నియమించారు. ఈ పదవీ కాలం ముగిశాక షర్మిలారెడ్డిని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారు.
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా చరిత్రలోనే తొలిసారిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పదవిని మహిళకు కేటాయించారు. మండపేట నియోజకవర్గానికి చెందిన దూలం పద్మకు ఈ పదవిని అప్పగించారు.
- అయ్యారక, ఎస్సీ, దేవతెలకుల, దృశ్యకళల అకాడమీ వంటి రాష్ట్ర స్థాయి చైర్‌పర్సన్ పదవులను ఆవాల రాజశ్వరి, పెదపాటి అమ్మాజీ, సంకిస భవానీప్రియ, కుడుపూడి సత్యశైలజలకు కేటాయించారు.
- ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో మున్సిపల్ చైర్‌పర్సన్లుగా మహిళలకు అవకాశాలు లభించాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, కాకినాడ నగర మేయర్‌గా సుంకర శివప్రసన్న, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా రెడ్డి సత్య నాగేంద్రమణి, తుని, మండపేట, సామర్లకోట, పెద్దాపురం, కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్లుగా ఏలూరి సుధారాణి, పతివాడ దుర్గారాణి, గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, బావన రత్నకుమారికి అవకాశాలు అందించారు. జయశ్రీని మహిళా కమిషన్ సభ్యురాలిగా, జమ్మలమడక నాగమణిని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు.
- వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది మంది మహిళలకు ఉద్యోగావకాశాలు లభించాయి.

అన్నింటా పెద్ద పీట

- నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇళ్ల పట్టాలు మహిళల పేరిట ఇవ్వడమే కాకుండా, వారి పేరు మీదనే రిజిస్ట్రేషన్ చేసి అందిస్తున్నారు. తద్వారా చిల్లిగవ్వ ఖర్చు లేకుండా వారికి రూ.5 లక్షల నుంచి రూ.12 లక్షల విలువైన ఆస్తిని సమకూరుస్తున్నారు. ఇలా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 2.50 లక్షల ఇళ్లకు మహిళలను యజమానులను చేశారు.
- జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం తదితర పథకాల లబ్ధి నేరుగా మహిళలకే అందించి, సమాజంలో వారికి ప్రాధాన్యం కల్పించారు. ఆయా పథకాల లబ్ధిని నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకే జమ చేసి వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటునందించారు. ప్రభుత్వ తోడ్పాటుతో మహిళలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో పాటు చిరు వ్యాపారాలతో రాణిస్తున్నారు.

ప్రతి రోజూ పండగే..



మహిళా దినోత్సవంనాడే కాదు.. జగనన్న ప్రభుత్వంలో మహిళలకు ప్రతి రోజూ పండగే. వారికి ప్రత్యేక స్థానం లభించింది. దిశ చట్టం తీసుకువచ్చి మహిళలకు భద్రత కల్పించిన ఏకైక సీఎం జగన్. సాధారణ గృహిణిగా ఉన్న నాకు కౌన్సిలర్‌గా ఎన్నికవడం, ఆ తరువాత రుడా చైర్‌పర్సన్, ఇప్పుడు కీలకమైన హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారు.

– మేడపాటి షర్మిలారెడ్డి, చైర్‌పర్సన్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, రాజమహేంద్రవరం

వంటింటి నుంచి చైర్‌పర్సన్‌గా..



వంటింటికి పరిమితమైన నేను వార్డు కౌన్సిలర్‌గా గెలిచాను. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ఒక బీసీ మహిళగా చైర్‌పర్సన్‌గా అవకాశం దక్కింది. నాలాంటి ఎంతో మంది మహిళలకు సీఎం జగన్ ప్రభుత్వంలో సముచిత స్థానం లభించింది. స్థానిక సంస్థల్లో పదవులే కాదు.. అనేక సంక్షేమ పథకాల లబ్ధి కూడా మహిళలకు అందింది.

– రెడ్డి సత్య నాగేంద్రమణి, మున్సిపల్ చైర్‌పర్సన్, అమలాపురం

మహిళాభ్యున్నతికి కృషి



తోడబుట్టిన సోదరునిలా అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ అండగా ఉంటూ మహిళా సాధికారతకు పాటు పడుతున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో మునుపెన్నడూ లేనివిధంగా చైర్‌పర్సన్ పదవిని తొలిసారిగా మహిళకు ఇచ్చి, సముచిత స్థానం కల్పించారు. మహిళల అభివృద్ధి పట్ల సీఎం జగన్ నిబద్ధతకు ఇది నిదర్శనం.

– దూలం పద్మ, చైర్‌పర్సన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ, కేశవరం

క్లుప్తంగా

'నన్నయ' వర్సిటీలో స్పానిష్ అధ్యాపకురాలి నియామకం



నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఎంబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటీలో ఫారన్ లాంగ్వేజ్ కోర్సు స్పానిష్‌ను బోధించేందుకు అధ్యాపకురాలిగా శివానీని నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆమెకు అందజేశారు. ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాషలలో స్పానిష్ ఒకటని, దీనిపై పట్టు సాధించవలసిన అవసరం ఎంతో ఉందని వీసీ పేర్కొన్నారు. ఎంబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటీ విభాగంలో ఫారిన్ లాంగ్వేజ్ కోర్సును ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే స్పానిష్ సర్టిఫికెట్ కోర్సును అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

ప్రసాద్ నిర్మాణాలకు శ్రీకారం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో మరో కీలక అంకానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం శ్రీకారం చుట్టారు. పిల్‌గ్రిమేజ్ రీజువెనేషన్ అండ్ స్పిర్చ్యువల్ అగ్మంటేషన్ డ్రైవ్ ('ప్రసాద్') స్కీం కింద దేశవ్యాప్తంగా రూ.6,400 కోట్లతో 53 ప్రాజెక్టులను ఏక కాలంలో ప్రధాని మోదీ గురువారం జమ్ము కాశ్మీర్ రాజధాని శ్రీ నగర్ నుంచి వర్చ్యువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. వాటిలో సత్యనారాయణస్వామి దేవస్థానానికి 'ప్రసాద్' స్కీం కింద మంజూరు చేసిన రూ.20.06 కోట్లతో చేపట్టనున్న నిర్మాణ పథకాలను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఆయన ప్రసంగిస్తూ ఆలయ పర్యాటక అభివృద్ధికి 'ప్రసాద్' స్కీం తోడ్పడుతుందని తెలిపారు. ప్రసాద్ స్కీం శిలాఫలకాన్ని కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ ఆవిష్కరించారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఎండీ, అరవేటి లక్ష్మీ మల్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్, ఏసీ విశ్వనాథరాజు పాల్గొన్నారు.

మరిన్ని 'ప్రసాద్' నిధులకు ప్రయత్నం

రూ.92 కోట్లతో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు అందచేయగా రూ.54 కోట్లకు డీపీఆర్ కూడా అయింది. మిగిలిన రూ.34 కోట్లు రాబట్టేందుకు ప్రయత్నం చేస్తానని ఎంపీ గీత తెలిపారు. నెల రోజుల వ్యవధిలోనే టెండర్లు పిలిచి, ఖరారు చేసి పనులు పూర్తి చేయాలని టూరిజం అధికారులను కోరామని ఈఓ కే రామచంద్రమోహన్ చెప్పారు.



రత్నగిరిపై శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత, ఏపీటీడీసీ ఎండీ మల్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ తదితరులు

ప్రసాద్ నిర్మాణాల వివరాలు

రూ.11,50,68,000 అంచనా విలువతో రెండంతస్తుల్లో అన్నదానం భవనం, రూ. 05,94,86,000 అంచనా వ్యయంతో భక్తుల క్యూ కాంప్లెక్స్, రూ.61,85,000 అంచనా విలువతో భక్తుల టాయిలెట్ బ్లాక్, రూ.1,02,57,000 అంచనా వ్యయంతో ఎలక్ట్రానిక్ కార్లు నాలుగు, చార్జింగ్ స్టేషన్లు రెండు నిర్మించనున్నారు.



ప్రసాద్ నిధులతో నిర్మించనున్న క్యూ కాంప్లెక్స్ నమూనా

అమ్మాయిలు చదివితే ఇంటిల్లిపాదీ విద్యావంతులే

'నన్నయ'లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

రాజానగరం: అమ్మాయిలను విద్యావంతులను చేస్తే ఇంటిల్లిపాదీ విద్యావంతులయ్యేందుకు అవకాశం ఉంటుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవన్‌లో 'మహిళల ద్వారా పెట్టుబడులు పెట్టండి – పురోగతిని వేగవంతం చేయండి' అనే అంశం పై గురువారం నిర్వహించిన సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అబ్బాయిల చదువు వారికే పరిమితమవుతుందన్నారు. గోదావరి జిల్లాలలో అధిక శాతం మహిళలు విద్యావంతులుగా ఉన్నారని, 'నన్నయ' వర్సిటీ కూడా మరింత ప్రోత్సాహాన్ని అందిస్తూ, విద్యార్థినులకే ప్రాధాన్యమిస్తుందన్నారు. యూనివర్సిటీలో విద్యార్థినులతోపాటు అధ్యాపకులు, అధికారులు, బోధనేతరులలో కూడా ఎక్కువ శాతం మంది మహిళలే ఉన్నారని గుర్తు చేశారు. జిల్లా కోర్టు లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ సమాజంలో నేడు ప్రతి విషయంలోను పురుషులతో పోటీపడుతున్న మహిళలు తమలోని సున్నితత్వాన్ని కూడా తగ్గించుకుని, శారీరకంగా, మానసికంగా ధృడంగా ఎదగాలని సూచించారు. ప్రతి చిన్న విషయానికి కంట తడి పెట్టడం, ఆత్మహత్యలకు పాల్పడటం వంటివి చేసేది ఎక్కువగా మహిళలేనన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టిని సారించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నతనం నుంచి ఆడ, మగ విషయంలో భేద భావాలు చూపకుండా, సమానత్వంతో పెంచాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడ పోటీలలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. యూనివర్సిటీలో కూచిపూడి డిప్లమా కోర్సు చేస్తున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, రంపచోడవరంలోని డిగ్రీ కళాశాల విద్యార్థుల జానపద నృత్య ప్రదర్శన, యోగా, ధింసా నృత్యాలు అలరించాయి. యూనివర్సిటీ వుమెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నూకరత్నం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, న్యాయవాది ఉమామహేశ్వరి, అధ్యాపకులు డాక్టర్ పి. విజయనిర్మల, సర్వశిక్ష అభియాన్ అధికారి సుభాషిణి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యూషకుమారి



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు



యోగ, జానపద నృత్య ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

గురుకులాల ఎంట్రన్స్‌కు ఏర్పాట్లు

- ఈ నెల 10న ప్రవేశ పరీక్ష
- 20 కేంద్రాల్లో రాయనున్న 6,845 మంది

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పేద, మధ్య తరగతి, అల్పాదాయ వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ఐదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి ఈ నెల 10న పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో ఐదవ తరగతికి 1,600 సీట్లకు 3,164 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి 1,722 సీట్లకు గాను 3,681 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలో అర్హత సాధించిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ..

తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 21 గురుకులాలున్నాయి. అనపర్తి మండలంలోని కొత్తూరు జూనియర్ కళాశాల మినహా మిగిలిన 20 గురుకులాల్లో ఐదవ తరగతికి 80 సీట్లు వంతున 1,600, తుని మండలం లోవకొత్తూరులోని ఉన్న పాఠశాల మినహా మిగిలిన 20 జూనియర్ కళాశాలల్లో 1,600 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాలికలకు 16, బాలురకు 05 గురుకుల పాఠశాలలున్నాయి. కాకినాడ జిల్లాలో తొమ్మిది, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఆరు వంతున గురుకుల పాఠశాలలున్నాయి. ఐదవ తరగతిలో ప్రవేశానికి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న గురుకులాలకు 400 సీట్లకు 1,119 మంది, కాకినాడ జిల్లాలో 720 సీట్లకు 1,554 మంది, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 480 సీట్లకు 491 మంది పోటీ పడుతున్నారు. ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని గురుకుల జూనియర్ కళాశాలల్లో 520 సీట్లకు 1,359 మంది, కాకినాడ జిల్లాలో 720 సీట్లకు 1,600 మంది, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 480 సీట్లకు 722 మంది పోటీ పడుతున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. హాల్ టికెట్‌లో ఉన్న కేంద్రంలో మాత్రమే పరీక్ష రాసేందుకు అనుమతినిస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 20 గురుకుల పాఠశాలల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

సదుపాయాలు కల్పించాం



గురుకుల పాఠశాలల్లో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా మౌలిక సదుపాయాలను కల్పించాం. కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా పరీక్షరాసే విద్యార్థులు మాస్క్ ధరించి రావాలి. సెల్‌ఫోన్‌తో సహా ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.

– పి.ఉమాదేవి, ఇన్‌చార్జి జిల్లా కోఆర్డినేటర్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, కాకినాడ

ఎమ్మెల్యే టిక్కెట్లలో సముచిత స్థానమివ్వాలి

టీడీపీ శెట్టిబలిజ నాయకుల డిమాండ్



కొత్తపేటలో ఐక్యతను చాటుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ శెట్టిబలిజ నాయకులు

కొత్తపేట: టీడీపీ అసెంబ్లీ టికెట్ల కేటాయింపులో శెట్టిబలిజలకు సముచిత స్థానం కల్పించాలని ఆ పార్టీ శెట్టిబలిజ నాయకులు అధిష్టాన వర్గాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాత్రి స్థానిక ఆర్‌ఎస్ బీసీ కన్వెన్షన్ హాలులో జిల్లా టీడీపీ శెట్టిబలిజ నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ శెట్టిబలిజ కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ టిక్కెట్ల కేటాయింపుపై చర్చించారు. సత్తిబాబు మాట్లాడుతూ ఇటీవల టీడీపీ – జనసేన ప్రకటించిన సీట్లలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కనీసం ఒక్క సీటు కూడా శెట్టిబలిజలకు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటి నిలిచిన శెట్టిబలిజలకు ప్రాధాన్యం కల్పించకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీలో ఇప్పటి వరకూ ప్రకటించిన స్థానాల్లో మూడు అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లను శెట్టిబలిజలకు కేటాయించారని అన్నారు. ఆ పార్టీకి దీటుగా కాకపోయినా కనీసం రెండు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం అయినా కేటాయిస్తే తమ సామాజిక వర్గీయుల్లో ఓట్లను అడిగేందుకు వీలుంటుందని అన్నారు. ఇప్పటికైనా టీడీపీ – జనసేన నాయకులు స్పందించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శెట్టిబలిజలు అత్యధికంగా ఉన్నచోట్ల రెండు స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రామచంద్రపురం టిక్కెట్‌ను శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంకు కేటాయించాలని కోరారు. టీడీపీ సాధికారిక కన్వీనర్ దాసరి వీర వెంకటసత్యనారాయణ, రాజోలు ఎంపీపీ కేటా శ్రీను, డాక్టర్ కాదా వెంకటరమణ, చెల్లుబోయిన శ్రీను, మొల్లేటి శ్రీను, కముజు వెంకటేశ్వరరావు, యల్లమిల్లి జగన్ మోహన్ పాల్గొన్నారు.

ఉత్తరకంచి బ్యాంక్ దొంగల పట్టివేత

- రూ.1.46 కోట్ల విలువైన నగలు, నగదు స్వాధీనం
- ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: ప్రత్తిపాడు మండలం ఉత్తర కంచి గ్రామంలో ఫిబ్రవరి 7వ తేదీన స్టేట్‌బ్యాంక్‌లో జరిగిన చోరీకి సంబంధించి నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ చోరీకి పాల్పడింది ఏడుగురు దొంగలు. మహారాష్ట్రకు చెందిన అక్షయ్ గజానన్, వైభవ్ నారాయణ్‌రావు, హరీష్ మిలింద్ గైక్వాడ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన దస్వీర్ సహా మరో ముగ్గురు ఈ నేరానికి పాల్పడ్డారు.

గూగుల్ మ్యాప్‌లో వెదికి..

గూగుల్ మ్యాప్‌లో ఉత్తరకంచి స్టేట్‌బ్యాంక్‌ను గుర్తించి దొంగతనానికి వ్యూహ రచన చేశారు. మండపేటలో దుప్పట్లు అమ్మే వ్యక్తులుగా కాలు మోపారు. కొన్నాళ్లు స్థానికంగా దుప్పట్లు విక్రయిస్తూ లాడ్జిలో నివసించారు. ఈ లోపు మండపేట బ్యాంకుపైనా కన్ను పడింది. అయితే కట్టుదిట్టమైన భద్రతా చర్యల వల్ల వెనక్కి తగ్గి గూగుల్ మ్యాప్‌లో గుర్తించిన ఉత్తర కంచి బ్రాంచ్‌కే ఫిక్స్ అయ్యారు. మండపేటలో ఉంటూనే ఉత్తరకంచి బ్యాంకు చుట్టూ తిరుగుతూ కొన్ని రోజుల పాటు రెక్కీ నిర్వహించారు. తమ ముఖాలు గుర్తు పట్టకుండా మారు వేషాల్లో కూడా తిరిగారు. సామర్లకోటలో కొంతమందితో పరిచయాలు పెంచుకున్నారు. ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

చోరీ చేశారిలా..

ఏడుగురు కలిసి తమ సొంత కారులో ఉత్తర కంచి శివారుకు ఫిబ్రవరి 7వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో చేరుకున్నారు. శ్మశానం వద్ద ఆరుగురు దిగిపోయి, వాహనం నడిపిన హరీష్‌ను కారు తీసుకు వెళ్లిపొమ్మని చెప్పారు. పని పూర్తయ్యాక చెబుతాం రావాలని సూచించారు. పొలాల మీదుగా బ్యాంకు వెనుక భాగానికి చేరుకున్నారు. అప్పటికే తెచ్చుకున్న పరికరాలతో కిటికీని తొలగించి లోపలికి చేరారు. అలారం, సీసీ కెమెరాల వైర్లను కత్తిరించారు. స్ట్రాంగ్ రూం తాళాలు గ్యాస్ కట్టర్ సాయంతో కత్తిరించారు. నాలుగు లాకర్లలో రెండు తెరిచారు. అందులో ఉన్న రూ.27.34 లక్షల నగదుతో పాటు రూ.1.19 కోట్ల విలువైన 3.28 కిలోల బంగారాన్ని తమతో తెచ్చుకున్న సంచుల్లోకి నింపుకున్నారు. వచ్చిన మార్గం గుండానే మెయిన్ రోడ్డు వరకు వెళ్లి అప్పటికే కారుతో ఎదురుచూస్తున్న హరీష్‌తో కలిసి అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లారు.

నలుగురు కారులో... ముగ్గురు ట్రైన్‌లో...

నగదు, నగలు దోచేసి వెళుతూ బ్యాంకు నుంచి క్యాష్ కౌంటింగ్ మెషీన్, ఎలక్ట్రానిక్ కాటాలను కూడా దొంగిలించారు. వాటి సాయంతో డబ్బు లెక్కించి, బంగారం తూచి తెల్లవారుఝామున 4 గంటల సమయంలో పంపకాలు పూర్తయిన తర్వాత నలుగురు కారులో మహారాష్ట్రకు, ముగ్గురు రైలులో ఉత్తరప్రదేశ్‌కు బయల్దేరారు.



స్వాధీనం చేసుకున్న నగలు, నగదు

నిందితులంతా 25 ఏళ్ల లోపు వారే..

నిందితుల్లో నలుగురు పట్టుబడగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు. నిందితులంతా పాతికేళ్ల లోపు వారేనని, వీరి నేర చరిత్ర తెలుసుకునేందుకు వివిధ రాష్ట్ర పోలీసులతో సంప్రదింపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో కేసు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి సారథ్యంలో ట్రైనీ ఐపీఎస్ నవజ్యోతి మిశ్రా పర్యవేక్షణలో ట్రైనీ డీఎస్పీ సాయిఈశ్వర్, సీఐలు శేఖర్‌బాబు, అంకబాబు, చిట్టిబాబు, చైతన్యకృష్ణ, సురేష్, నాగేశ్వర్ నాయక్, కృష్ణభగవాన్, మూర్తి, శ్రీనివాస్, ఇతర పోలీస్ బృందాలతో పాటు ఐటీ కోర్ కీలకంగా వ్యవహరించిందని అన్నారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

తమ్ముళ్ల ఓవర్ యాక్షన్‌పై భక్తుల ఆగ్రహం

- తపో ఆశ్రమంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం
- ఆగ్రహించి బాబు పటాన్ని పంట కాలువలో పడేసిన భక్తులు
- ఆ స్థలాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసిన వైనం

ముమ్మిడివరం: పవిత్ర ఆశ్రమ ప్రాంగణంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చిత్రపటానికి పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేసిన ఉదంతమిది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ముమ్మిడివరం బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో రెండురోజులుగా తీర్థ మహోత్సవాలు జరుగుతున్నాయి. ముమ్మిడివరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో పాటు పలువురు టీడీపీ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిమిత్తం బాలయోగీశ్వరుల తపో ఆశ్రమం వద్దకు వచ్చారు. ఆశ్రమ ఆవరణలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి రాజకీయ ఉపన్యాసాలు ఇచ్చారు. దీంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయాల్లో దేవతా విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేస్తారని, టీడీపీ వారు తమ నాయకుడికి అభిషేకం చేసి తమ మనోభావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలయోగీశ్వరుల కుటుంబీకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు క్షీరాభిషేకం చేసిన చంద్రబాబునాయుడు చిత్రపటాన్ని అక్కడ నుంచి తొలగించి పక్కనే ఉన్న పంట కాలువలో పడేశారు. క్షీరాభిషేకం చేసిన స్థలాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేశారు.



తపో ఆశ్రమ ఆవరణ నుంచి చంద్రబాబు చిత్రపటాన్ని తొలగిస్తున్న భక్తులు



పంట కాలువలో పడేసిన చంద్రబాబు చిత్రపటం

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో శ్రీస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేద మంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, కల్యాణం నిర్వహించారు. ఏసీ వి.సత్యనారాయణ ఆధ్వర్యాన సిబ్బంది భక్తులకు స్వామివారి మూల విరాట్టు దర్శనం, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి పాల్గొన్నారు.